
సాక్షి పల్నాడు

ఆదివారం । 29 । అక్టోబర్ । 2023




కోటప్పకొండ ఆలయం మూసివేత

నరసరావుపేటరూరల్: చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని త్రికోటేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం మూసివేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 525.10 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 4808 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 246 క్యూసెక్కులు విడుదల చేశారు.



జన కెరటం....బాపట్ల పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో జరిగిన బహిరంగసభకు హాజరైన జన సందోహం

సామాజిక సమరోత్సాహం

- యాత్రకు జైకొట్టిన భావపురి
- గ్రామాల నుంచి తరలివచ్చిన అభిమానులు
- భారీ ద్విచక్రవాహన ర్యాలీలు
- నేతలకు ఘనస్వాగతం
- జగనన్నతోనే అభివృద్ధి అంటూ నినాదాలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రకు బాపట్ల నియోజకవర్గ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అభిమాన నేతలకు అడుగడుగునా నీరాజనం పలికారు. గ్రామీణ ప్రాంతాలలో వివిధ సామాజిక వర్గాల ప్రజలు తరలివచ్చి పూల వర్షం కురిపించి తమ మద్దతు తెలిపారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన యువత ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. టపాసులు, డప్పుల మోతతో హోరెత్తించారు.



సామాజిక సాధికార యాత్ర అగ్ర భాగాన విజయసాయిరెడ్డి, మోపిదేవి, ఉమ్మారెడ్డి, కోన, సునీత



ద్విచక్రవాహన ర్యాలీలో పాల్గొన్న యువత

సాక్షి ప్రతినిధి, బాపట్ల: పిట్టలవానిపాలెం మండలం సంగుపాలెంకోడూరులో మధ్యాహ్నం 12.20 గంటలకు సామాజిక సాధికార యాత్ర ప్రారంభమైంది. పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు యాత్రకు ఘనస్వాగతం పలికారు. అనంతరం మధ్యాహ్నం 1.10 గంటలకు యాత్ర చందోలులోని బండ్లమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుంది. నేతలకు ఆలయం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయంలో నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1.55 గంటలకు చందోలులోని పెద్ద మసీదుకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చందోలులోని నీలి బంగారయ్య ఉన్నత పాఠశాలలో జరిగిన నాడు–నేడు పనులను పరిశీలించారు. నాడు–నేడు ద్వారా విద్య, వైద్యం తదితర విభాగాలలో జరిగిన అభివృద్ధి పనులను రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి ప్రజలకు వివరించారు. చందోలు నుంచి ప్రారంభమైన యాత్ర రెడ్డిపాలెం, కర్లపాలెం మీదుగా సాయంత్రం 5.30 గంటలకు బాపట్ల పట్టణానికి చేరుకుంది. భారీగా తరలివచ్చిన యువకులు ద్విచక్రవాహనాలపై ర్యాలీగా యాత్ర వెంటే సాగారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో 5.40 గంటలకు బహిరంగసభ ప్రారంభమైంది. సభలో గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, మోపిదేవి వెంకటరమణారావు, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పోతుల సునీత, ఎమ్మెల్యేలు కోన రఘుపతి, మహ్మద్ ముస్తఫా, మార్కెటింగ్ శాఖ సలహాదారుడు బత్తుల బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేతల ప్రసంగాలకు అపూర్వ స్పందన

చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు విశేష కృషిచేశారని మంత్రి జోగి రమేష్, ఎంపీలు మోపిదేవి, నందిగం సురేష్ అన్నారు. చంద్రబాబు బడుగు, బలహీనవర్గాలను ఏమాత్రం ఎదగనీయకుండా అణచివేశారన్నారు. ఆయా వర్గాల ప్రజలపై కేసులు పెట్టించి వారిని జైళ్ల పాలు చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఆ వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసి అందలం ఎక్కించారన్నారు. దీంతో సభకు హాజరైన ఆయా సామాజిక వర్గాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. రాబోయే ఎన్నికల్లోనూ తిరిగి జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుంటేనే పేద వర్గాలకు మేలు జరుగుతుందని నేతలు ఇచ్చిన పిలుపుకు జనం పెద్దఎత్తున స్పందించారు. కాబోయే ముఖ్యమంత్రి జగన్ అంటూ పెద్దఎత్తున నినదించారు.



బండ్లమ్మ ఆలయంలో హోమం చేస్తున్న నేతలు



చందోలు పెద్ద మసీదులో ప్రార్థనలు



మంత్రి, ఎమ్మెల్యేలను సత్కరిస్తున్న దృశ్యం

స్వచ్ఛమైన ఓటరు జాబితా ఈఆర్వోలదే బాధ్యత

జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

నరసరావుపేట: స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీలో ఓటర్ల నమోదు అధికారులు (ఈఆర్వోలు)పూర్తి బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లోతేటి శివశంకర్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, ఎన్నికల అధికారులు, క్షేత్ర స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ల జాబితాను బూత్ స్థాయి అధికారులందరికి అందజేసి అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించాలన్నారు. ధ్రువీకరణ పత్రాలను ఈఆర్వోలు (ఓటర్ల నమోదు అధికారులు) సంతకంచేసి పంపాలన్నారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు తొలగింపులకు సంబంధించిన ఫారం 6,7,8లను వెంటనే పరిష్కరించి అప్‌లోడ్ చేయాలన్నారు. కొత్తగా వచ్చే దరఖాస్తులను కూడా ఎప్పటికప్పుడు విచారించి నవంబర్ 21వ తేదీలోగా అప్‌లోడ్ చేయాలన్నారు. ఎన్నికల సంఘం ప్రకటించిన తేదీల్లో పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. జేసీ ఎ.శ్యామ్‌ప్రసాద్, డీఆర్వో కె.వినాయకం పాల్గొన్నారు.

విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రభుత్వం పెద్ద పీట

రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, వేదికపై మంత్రి జోగి రమేష్, ఎంపీలు మోపిదేవి, నందిగం సురేష్, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి, సునీత, ఎమ్మెల్యే కోన రఘుపతి

చందోలు(కర్లపాలెం): ప్రభుత్వం విద్య, వైద్యం , వ్యవసాయ రంగాలకు పెద్ద పీట వేస్తుందని వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి తెలిపారు. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చందోలులోని నీలి బంగారయ్య పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా వచ్చిన విజయసాయిరెడ్డి శనివారం పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. విద్యార్థులు సీఎం జగన్‌పై, దివంగత నేత వైఎస్సార్‌పై పాటలు పాడి అలరించారు. విజయసాయిరెడ్డి మాట్లాడుతూ నాడు–నేడు కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. మాతృభాషకు ప్రాధాన్యమిస్తూ ఆంగ్ల భాషను కూడా విద్యార్థులకు నేర్పేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టామన్నారు. ఇంగ్లీష్ నేర్చుకున్న విద్యార్థులు భవిష్యత్తులో ఏ రాష్ట్రంలోనైనా ఏదేశంలోనైనా ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకునేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. చందోలు నీలి బంగారయ్య పాఠశాలకు రెండు విడతలుగా అభివృద్ధి పనుల కోసం నాడు–నేడు కార్యక్రమంలో సుమారు రూ.కోటి మంజూరయ్యాయని తెలిపారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. 2024లో జరిగే ఎన్నికలలో కోన రఘుపతిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం విజయసాయిరెడ్డిని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పాస్టర్లు విడివిడిగా కలసి తమ సమస్యలను వివరించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణారావు, రాష్ట్ర మంత్రి జోగి రమేష్, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పోతుల సునీత, ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ ముస్తఫా తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే చర్యలు

జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్



నరసరావుపేట: లింగనిర్ధారణ పరీక్షలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో చైర్మన్ హోదాలో కలెక్టర్ జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో లింగ నిర్ధారణ చట్టం–94ను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ చట్టం పరిధిని ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 156 ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులు లింగ నిర్ధారణ చట్టం పరిధి కింద అనుమతులు తీసుకున్నాయన్నారు. వీరందరూ చట్టం ప్రకారం అన్ని రికార్డులు మైంటైన్ చేయాలన్నారు. కాగా, నూతనంగా ఆరు స్కాన్ సెంటర్లు, ఐదు రెన్యువల్స్, 12 మార్పుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి చట్టం కింద అనుమతులు మంజూరు చేశారు. డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రవి, నోడల్ ఆఫీసర్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, రెడ్‌క్రాస్ సొసైటీ మెంబర్ డాక్టర్ ఎం.వసంతకిరణ్, అదనపు ఎస్పీ యు.రవిచంద్ర పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

నరసరావుపేట ఈస్ట్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ శనివారం తెలిపారు. 2024 మార్చి నెలలో జరగనున్న పదవ తరగతి పరీక్ష ఫీజును అన్ని యాజమాన్య పాఠశాలలు తమ విద్యార్థుల ఫీజును ఎటువంటి అపరాధ రుసుం లేకుండా నవంబర్ 10వతేదీ లోపు చెల్లించాలని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు రూ.125 చెల్లించాలన్నారు. అపరాధ రుసుం రూ.50లతో నవంబర్ 16వతేదీ వరకు, రూ.200లతో నవంబర్ 22 వరకు, రూ.500లతో నవంబర్ 30వ తేదీ వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందని వివరించారు. పరీక్షకు హాజరయ్యేందుకు 2009 ఆగస్టు 31వతేదీ, 2009 సెప్టెంబర్ 1వతేదీ (14 సంవత్సరాలు) తర్వాత పుట్టినవారు అనర్హులని పేర్కొన్నారు. అయితే వయస్సు మినహాయింపుతో పరీక్షకు హాజరుకావచ్చని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్యానికి రక్షణ

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లి 7,8 వార్డుల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

సత్తెనపల్లి: ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని 7,8 వార్డుల ప్రజలకు ఎస్‌బీఐ రోడ్‌లోని ఫిరోజ్ మందిరం వద్ద గల భవిష్య పాఠశాలలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మంత్రి అంబటి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రజల ఆరోగ్యం కోసం 104, 108, ఆరోగ్యశ్రీ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. అదే బాటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఖరీదైన వైద్యాన్ని ప్రతి ఒక్కరికీ ఉచితంగా అందిస్తున్నారన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దోహదపడుతుందన్నారు. వైద్య సేవలను ప్రజల చెంతకే తీసుకెళ్లిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యూపీహెచ్‌సీ వైద్యులు జి.ధర్మసింగ్ శాస్త్రి, సాయి తేజరెడ్డి, అనిత, హరీషాలు 605 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రక్త శాతం, రాండమ్ బ్లడ్ షుగర్ పరీక్షలను 131 మందికి నిర్వహించారు. మలేరియా, ఈసీజీ పరీక్షలను 12 మందికి నిర్వహించారు. అదనపు వైద్య పరీక్షల నిమిత్తం ఆరుగురిని జిల్లా ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారం ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించి న్యూట్రిషన్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, 8వ వార్డు కౌన్సిలర్ గుజ్జర్లపూడి ప్రమీల, 7,8 వార్డుల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిలు దేవరశెట్టి రవికుమార్, రేపూడి రవితేజ, 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్‌కుమార్, మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకురాలు రేపూడి విజయ్‌కుమారి, మున్సిపల్, సచివాలయ, యూపీహెచ్‌సీ సిబ్బంది, వార్డు వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్షలో మందుల కిట్ పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

అండర్–19 బాల బాలికల హాకీ జట్ల ఎంపిక

సత్తెనపల్లి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని చేబ్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల వ్యాయామ అధ్యాపకుడు వై.పెద్దబ్బాయి అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ –19 బాల, బాలికల హాకీ జిల్లా జట్ల ఎంపికలు పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. తొలుత హాకీ పోటీలను నిర్వహించి ఎంపికలను ప్రారంభింపజేశారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు నవంబర్‌లో జరిగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి 67వ స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని పెద్దబ్బాయి తెలిపారు.

బాలుర జట్టు : ఎ.బాల యేసు, ఎం.రుషి, ఎం.శివ దుర్గా గణేష్, కె.రాహుల్, సయ్యద్ షాహిద్ అహ్మద్, షేక్.సుభాని, కె.ఉత్తేజ్, ఎం.శరత్ చంద్ర, జె.ప్రవీణ్‌కుమార్, కె.రాకేష్, పి.వెంకటేష్, పి.తేజ్ ప్రణీత్, బి.లక్ష్మీ ప్రకాష్, కె.విజయ చోళుడు, డి.మధుమోహన్, షేక్ నజీర్, బి.వికాస్, ఎస్.దత్త సాయి, స్టాండ్ బై లుగా షేక్. సమీర్, షేక్. సర్దార్, జి. అరుణ్‌లు ఎంపికయ్యారు.

బాలికల జట్టు: బూసిరాజు పావని సాయి, ఎన్.రమ్య, టి.స్రవంతి, సి.హెచ్ లాస్య, పి.శివ బిందు, కె.శివనాగఅంజలి, ఎం.నీలిమ, జె.తనుశ్రీ,, చట్టు జ్ఞాన శ్రీ అర్చన, వి.అఖిల, షేక్ ఆసిఫా, ఎ.హారిక, కె.వెంకట త్రివేణి, టి. జయలక్ష్మి, జి.కీర్తన, కె.మోహనలక్ష్మి, ఎం.వజ్ర వైడూర్య, డి.స్వరూప, స్టాండ్ బైలుగా బి. అఖిల, కె.లక్ష్మీభవానిలు ఎంపికయ్యారు. హెచ్‌ఎంలు కె.శ్రీనివాసరావు (నందిగామ), తోక సోమనాథ్(గుడిపూడి), కె.వెంకట్రావు (పెద్దమక్కెన), ఫిజికల్ డైరెక్టర్లు గంప శ్రీను, పి.శివరామకృష్ణ, లాకు పిచ్చయ్య, బి.అనిల్‌దత్త నాయక్, సీహెచ్ వి.నాగరాజు, వీర చంద్ర, భాస్కరరావు ఉన్నారు.

కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి వేడుకలు

నరసరావుపేట: సంస్కృతం కేవలం మార్కుల కోసం కాకుండా దానిపై పట్టు సాధించేందుకు విద్యార్థులు కృషిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పేర్కొన్నారు. శనివారం జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్‌లో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవ జీవితం ఎలా ఉండాలి అనేది రామాయణం తెలుపుతుందన్నారు. వెనుకబడిన తరగతుల శాఖ అధికారి వెంకటేశ్వర్లు, పలువురు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చర్చిల అభివృద్ధికి రూ. 12లక్షలు అందజేత



నగదును అందజేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: నియోజక వర్గంలోని పట్టణంలో 16వ వార్డులో పాస్టర్ యాకోబు ఇంటి వద్ద చర్చి నిర్మాణం కోసం రూ. 3లక్షలు, 8వ వార్డులో పాస్టర్ దానియేలు ఇంటి వద్ద చర్చి నిర్మాణానికి రూ.9,37,674 గ్రాంటును నగదు రూపంలో వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అందజేశారు. ఆయన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా నగదును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజక వర్గంలో అన్నీ చర్చిల అభివృద్ధికి ఇప్పటికే రూ. 3కోట్లకు పైగా గ్రాంట్ అందజేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ క్రైస్తవుల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలందిస్తానన్నారు. మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, కమిషనర్ ఈవీ రమణబాబు, కౌన్సిలర్లు మందా సంతోష్, వేల్పుల గురవయ్య, సురేష్, బొంగురు, అల్లి జీవన్ పాల్గొన్నారు.

కృష్ణవేణి కళాశాలకు నాక్ ఏ గ్రేడ్

నరసరావుపేట ఈస్ట్: కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. పల్నాడుజిల్లాలో నాక్ ఏ గ్రేడ్ పొంది తమ కళాశాల అరుదైన రికార్డు సాధించిందన్నారు. ఈనెల 12, 13 తేదీలలో తమ కళాశాలను సందర్శించిన నాక్ బృందం నివేదిక ఆధారంగా కళాశాలకు ఏ గ్రేడ్ ప్రకటించిందన్నారు. తమ కళాశాలలో అమలు చేస్తున్న విద్యా విధానాలు, అధ్యాపకుల బోధనా సామర్థ్యాలు, విద్యార్థులకు అందిస్తున్న మౌలిక సదుపాయాలు, పూర్వ విద్యార్థుల అభ్యున్నతి తదితర అంశాలను నాక్ బృందం ప్రత్యక్షంగా పరిశీలించిందని వివరించారు. కళాశాలను స్థాపించినప్పటి నుంచి విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. నాణ్యమైన విద్యా బోధనతో పాటు విద్యార్థుల అభిరుచిని గమనించి క్రీడలు, సాంస్కృతిక, కళారంగాలలో వారిని ప్రోత్సహిస్తున్నామని స్పష్టం చేశారు. నాక్ ఏ గ్రేడ్‌ను అధికారికంగా ప్రకటించటాన్ని పురస్కరించుకొని శనివారం కళాశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసి అధ్యాపకులను, విద్యార్థులను అభినందించారు. కళాశాల డైరెక్టర్ కె.నాసరయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కళాశాలలో సంబరాలు జరుపుకొంటున్న ప్రిన్సిపాల్ నాతాని, అధ్యాపకులు

రక్తదానానికి ముందుకు రావాలి

జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో శనివారం రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం – 2023 సందర్భంగా ప్రజారక్షణ కోసం వారు చేసిన త్యాగాలకు గుర్తుగా ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం ఎంతో గొప్పవిషయమన్నారు. మొబైల్ బ్లడ్ బ్యాంక్ వాహనాన్ని ఎస్పీ ప్రారంభించి పరిశీలించారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి, అదనపు ఎస్పీ(ఏఆర్) డి.రామచంద్రరాజు, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ శరత్‌బాబు, మేనేజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ సృజన, కేవీఎస్ఎస్ శ్రీనివాస గుప్తా, బత్తుల మురళి, రామాంజనేయులు, గెల్లి వీరారెడ్డి, ప్రభుత్వ వైద్యశాల ఆర్ఎంఓ డాక్టర్ దయానిధి పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

మానవతా విలువలకు ప్రతిబింబం రామాయణం

నరసరావుపేట: కుటుంబం, మానవతా విలువలు ప్రతిబింబించే విధంగా మహాకావ్యం రామాయణాన్ని రచించి సమాజానికి అందించిన మహాకవి మహర్షి వాల్మీకి కృషి ఎనలేనిదని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి కొనియాడారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పులమాలలతో నివాళులర్పించారు. అదనపు ఎస్పీ(ఏఆర్) డి.రామచంద్రరాజు, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

324 మద్యం సీసాలు పట్టివేత

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం గ్రామంలో జాతీయ రహదారి మార్గంలో చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఈబీ సీఐ ఆర్.విజయ్‌భాస్కర్‌రావు శనివారం తెలిపారు. సీఐ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల సమాచారం మేరకు వాహనాల తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా ఆటోలో తరలిస్తున్న 324 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని షేక్ పవన్ సాయి, కె.అడవయ్యలను అరెస్ట్ చేసి ప్రశ్నించగా విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సీఐ చెప్పారు. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం అడ్డరోడ్డు (పుట్టావారిపాలెం) ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి సూపర్‌వైజరు గంగినేని శ్రీకాంత్ సారథ్యంలో మద్యం బాక్సులను తమకు ఇచ్చి మండలంలోని పలు గ్రామాల్లో ఆటోలో బెల్ట్ షాపుల ద్వారా అమ్మకాలు చేసినందుకు గాను ఆటో బాడుగతో పాటు రోజు కూలి డబ్బులు ఇస్తారని నిందితులు తెలిపినట్లు సీఐ తెలిపారు. గతంలో 250 మద్యం సీసాలను అమ్మగా వచ్చిన రూ. 50 వేలు నగదు, ఆటోను సీజ్ చేసి ఇరువురు వ్యక్తులను కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా 15 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. మొదట నిందితుడు గంగినేని శ్రీకాంత్ పరారీలో ఉన్నడని రోజుల వ్యవధిలో అరెస్ట్ చేస్తామన్నారు.